క్లుప్తంగా

రోడ్డు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఏఎంవీఐ మహేష్

బోథ్: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఏఎంవీఐ మహేష్ అన్నారు. శుక్రవారం బోథ్ మండల కేంద్రంలోని షాదీఖానాలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ రవీందర్, బోథ్ ఎస్సై రాము, కానిస్టేబుల్ లక్ష్మణ్, రామ్మూర్తి, వామన్, లక్ష్మణ్, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎంబీ రికార్డులు చేయొద్దు



మాట్లాడుతున్న ఫైజుల్లాఖాన్

బేల: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంజూరు చేసి అడ్వాన్స్ పనులకు అధికారులు ఎంబీ రికార్డులు చేయొద్దని, నిర్లక్ష్యం చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో చేసిన సీసీరోడ్లు, డ్రైనేజీ పనుల్లో నాణ్యత లేకపోతే ఆ పనుల ఎంబీ రికార్డులు చేసిన అన్ని శాఖల ఏఈలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, బ్లాక్ అధ్యక్షుడు గుండవార్ సంజయ్, మడావి చంద్రకాంత్, బొక్రే శంకర్, రాక్రే విపిన్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

ఆదిలాబాద్‌టౌన్: యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం రిమ్స్‌లో శ్రీరామ్ సేన, తల్లి పిలుపు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అంతకు ముందు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి కళాజాత బృందం ద్వారా ప్రదర్శన నిర్వహించి, రిమ్స్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి గజానన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు సన్మానం

ఆదిలాబాద్: గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో ఇటీవల చోటు దక్కించుకున్న బాలకేంద్రం చిన్నారులను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం రాత్రి సన్మానించారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో బాలకేంద్రం చిన్నారులు ప్రదర్శన చేసి, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకోవడంతో ఎమ్మెల్యే చిన్నారులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వకులాభరణం ఆదినాథ్, బోయర్ విజయ్, చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం



షటిల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఇచ్చోడ: ప్రతీ ఏటా లోక శ్రీనివాస్‌రెడ్డి స్మారక క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం షటిల్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు నిర్వహించే ఈపోటీల్లో జిల్లా వ్యాప్తంగా 60 జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు గెలుపొందిన వారికి నగదుతో పాటు మెమోంటోలు అందజేయనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి, మహిముద్‌ఖాన్, కల్లెం నారాయణరెడ్డి, నిర్వాహకులు రాథోడ్ అనిల్‌కుమార్, కత్తురి సంతోష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నర్సరీలు పూర్తి చేయాలి

బోథ్: గ్రామాల్లోని నర్సరీలను త్వరతగతిన పూర్తి చేయాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. ప్రతీరోజు పారి శుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంపీవో జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు లేక అవస్థలు

- జీపీ కార్యాలయాల్లో కనీస వసతులు కరువు
- ఇబ్బంది పడుతున్న మహిళా ప్రజాప్రతినిధులు



మరుగుదొడ్డి లేని తలమడుగు గ్రామ పంచాయతీ కార్యాలయం

తలమడుగు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి సుపరిపాలన అందించాల్సిన గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో స్వచ్ఛత కరువైంది. ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని అధికారులు చెబుతున్నా.. అధికార యంత్రాంగం పంచాయతీ కార్యాలయాలను మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గాలు కొలువుదీరి వారి పాలన ముగిస్తున్నా.. పంచాయతీ కార్యాలయాల్లో మరుగుదొడ్లు కరువయ్యాయి. దీంతో మహిళా ప్రజాప్రతినిధులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

సొంత భవనాలు కరువు

మండలంలో 28 గ్రామ పంచాయతీలున్నాయి. అందులో బరంపూర్, కుచులాపూర్, దేవాపూర్, రుయ్యాడి, తలమడుగు, కజ్జర్ల, కోడద్, సుంకిడి గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు ఉన్నాయి. అయినా వాటిల్లో మరుగుదొడ్లు నిర్మించ లేదు. సమావేశాలు నిర్వహించే సమయంలో అధికారుల, మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు అవస్థలు పడుతున్నారు. దీంతో సమీపంలోని ఇళ్లలోకి వెళ్తున్నారు. చాలా గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేవు. ప్రతి గ్రామంలో స్వచ్ఛభారత్‌లో భాగంగా వందశాతం మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులు గతంలో లక్ష్యం పెట్టుకొని నిర్మించారు. కానీ గ్రామ పంచాయతీలపై మాత్రం దృష్టి సారించడం లేదు.

అధికారులదే బాధ్యత..

గ్రామాల్లో వందశాతం మరుగుదొడ్లు నిర్మించేందుకు గ్రామస్థాయి, మండలస్థాయి ప్రజా ప్రతినిధులు కృషి చేస్తున్నారు. ఇదే స్ఫూర్తితో గ్రామపంచాయతీ కార్యాలయాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు తొలి ప్రాధానంగా ఇవ్వాలి. పాలకవర్గం ఏర్పడ్డై ఐదేళ్ల పదవికాలం పూర్తి కావస్తుంది. కానీ ఎక్కడా నిర్మాణాలు చేపట్ట లేదు. ప్రస్తుతం యుద్ధ ప్రతిపదికన నిర్మాణాలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులదే. ఇంటింటికీ నిర్మించుకోవాలని కోరుతున్నా.. అధికార యంత్రంగం పంచాయతీ కార్యాలయాన్ని మాత్రం పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ పంచాయతీల్లో మరుగుదొడ్లు నిర్మించాలని పాలకవర్గం సభ్యులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

స్వచ్ఛభారత్‌లో భాగంగా గతంలో మండలంలోని పంచాయతీ కార్యాలయాలకు మరుగుదొడ్లు నిర్మించాలని ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరిగింది. కొత్తగా మంజూరైన గ్రామపంచాయతీ కార్యాలయాలకు మరుగుదొడ్లు నిర్మిస్తున్నాం. కార్యాలయంలో మరుగుదొడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

– రమాకాంత్, ఎంపీడీవో

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి



ఇంద్రవెల్లి: సమావేశమైన సీఐ రామకృష్ణ

ఆదిలాబాద్‌టౌన్/ బేల/ ఇంద్రవెల్లి/ నేరడిగొండ: శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా ఈనెల 22న నిర్వహించే ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో హిందూ ధార్మిక సంఘాల సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించారు. అలాగే బేల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో జైనథ్ సర్కిల్ సీఐ కోల నరేష్‌కుమార్, ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉట్నూర్ సీఐ రామకృష్ణ, నేరడిగొండ పోలీసుస్టేషన్‌లో ఎస్సై సాయన్న శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని, ఒకరికొకరు సోదరభావంతో పని చేయాలన్నారు. ఉత్సవాలు జరుపుకునే సమయంలో ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దన్నారు. విద్వేశాలు, రెచ్చగొట్టడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ర్యాలీలు నిర్వహించొద్దు

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సభలు నిర్వహించొద్దని ఆదిలాబాద్ రూరల్ సీఐ సైదారావు అన్నారు. శుక్రవారం సీఐ కార్యాలయ ఆవరణలో శాంతి సమావేశం నిర్వహించారు. అందరూ కలిసి, ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్, హెడ్ కానిస్టేబుల్ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య స్టిక్కర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



స్టిక్కర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ముద్రించిన శ్రీరామ జన్మభూమి అయోధ్య రామాలయం స్టిక్కర్లను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జనవరి 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో నిర్వహించనున్న కార్యక్రమాలను ఘనంగా జరుపుకోవాలన్నారు. 5000 స్టిక్కర్లను గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని నివాసాలతో పాటు వాహనాలపై అంటించాలని సూచించారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి గేడం మాధవ్, కోశాధికారి సూర్యకాంత్, తోట పరమేశ్వర్, లోలపు శ్రీనివాస్, ఉరాడే సుభాష్, సంజీవ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన కె.స్వామి (34) అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపాడు. ఈ నెల17 మంచిర్యాలకు వెళ్తున్నానని చెప్పిన స్వామి శుక్రవారం వరకూ ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ సైతం బంద్ చేసి ఉంది. దీంతోతండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

దాడికి పాల్పడిన వారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పాన్‌షాప్ యజమానిపై దాడికి పాల్పడిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని కాకతీయ బార్ పక్కన ఉన్న పాన్‌షాప్ యజమాని కిషోర్, ఆయన తండ్రిపై పట్టణానికి చెందిన శివకుమార్, కృష్ణతో పాటు వారి మిత్రులు దాడి చేసినట్లు పేర్కొన్నారు. సిగరేట్లు ఉద్దెర అడగగా అందుకు నిరాకరించడంతో ఆయనపై దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: బ్లేడ్‌తో గొంతు కోసుకొని ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ పట్టణంలోని 170 కాలనీకి చెందిన మెస్రం చరణ్ మద్యానికి బానిసై భార్యతో గొడవ పడ్డాడు. ఈక్రమంలో మనస్తాపానికి గురైన ఆయన పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ కాలనీ సమీపంలో బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. గమనించిన స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష



దీక్షలో పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ, నాయకులు

బేల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బేల బైపాస్ రద్దు కోసం డోప్టాల, శంషాబాద్, బేల, మోహబత్‌పూర్, బురాన్‌పూర్ రెవెన్యూ గ్రామాల శివారు రైతులు చేపట్టిన నిరాహార దీక్ష శుక్రవారం రెండో రోజుకు చేరింది. మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు గావుండే ఘణేశ్యాం పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు.

'నాసిరకం వస్తువులు అమ్మితే చర్యలు'



తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్

సిరికొండ: నాసిరకం వస్తువులు అమ్మితే చర్యలు తప్పవని డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్ వ్యాపారస్తులను హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని హోటళ్లు, కిరాణ దుకాణాలు, మెడికల్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. వస్తువులను ఎమ్మార్పీ ధరలకు అమ్మలన్నారు. అధిక ధరలకు కిరాణ వస్తువులు అమ్ముతున్నట్లు తమ దృష్టికి రావడంతో తనిఖీలు చేస్తున్నామన్నారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విలాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించాలి

గుడిహత్నూర్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించాలని సంత్‌శ్రీ ముక్తాశ్రీ దీదీ డోంగ్రే అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహంకాళి ఆలయ ప్రాంగణంలో దేవి భాగవత్ కథ కార్యక్రమంలో ప్రవచనాలు బోధించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు శంకర్ మహరాజ్, చాటే సంబాజీ, మాధవ్ కేంద్రే, శ్రీరామ్ లాందాడే, సంతోష్ గిత్తే, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



బ్యాంకును ప్రారంభిస్తున్న చైర్మన్ శోభా, బ్యాంకు అధికారులు

ఇంద్రవెల్లి: తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాష్ట్ర చైర్మన్ శోభా అన్నారు. శుక్రవారం ముందుగా కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని నూతన తెలంగాణ గ్రామీణ బ్యాంకును ప్రారంభించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పంట రుణాలు, డ్వాక్రా రుణాలు, గోల్డ్ లోన్స్, గృహ రుణాలు, వ్యక్తిగత రుణాలు, విద్య రుణం, వ్యాపార రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళ సంఘాల సభ్యులు రుణాలు పొంది సకాలంలో చెల్లించడంతో పాటు పొదుపు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ జాడి కృష్ణ, రీజినల్ మేనేజర్ వెంకట రామిరెడ్డి, ఐకేపీ ఏపీవో రామారావు, ఐకేపీ సీసీలు బామ్నే శ్రీరాం, దేవ్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఉట్నూర్‌రూరల్: స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ బ్యాంకు చైర్‌పర్సన్ శోభ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామీణ బ్యాంకులో స్వయం సహాయ మహిళా సంఘాలకు రూ. 2కోట్ల చెక్కును అందచేశారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో తక్కువ వడ్డీకి రుణాలు అందించడం జరుగుతుందన్నారు. వాయిదా పద్ధతిలో సకాలంలో చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ వెంకటరామరెడ్డి, బ్యాంకు మేనేజర్ మధుసుధన్ రెడ్డి, ఫీల్డ్ అధికారి అజయ్‌కుమార్, ఐకేపీ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పాల్గొన్నారు.

'ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలి'



రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలం బట్టి సావర్‌గాం శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 72/22, 72/23లో గల ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న 2,043 మంది నిరుపేద ఆదివాసీలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) నాయకులు కోరారు. శుక్రవారం మావల రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న ప్రాంతంలో రోడ్డు, విద్యుత్, విద్య, వైద్యం, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. సర్వే నంబర్ 72లో సబ్ డివిజన్ ఉందని, ఇది ఆసరాగా చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై ఎన్‌ఓసి తీసుకున్నారని ఆరోపించారు. మరణించిన సర్పంచ్ గంగన్న పేరుతో తప్పుడు సంతకాలు, ముద్రలు, స్టాంపులు సృష్టించి ప్రభుత్వ భూములను కబ్జా చేసి కోట్లు సంపాదిస్తున్నారని మండిపడ్డారు. అక్కడ నివాసం ఉంటున్న ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుకా, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, డివిజన్ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, వెడ్మ ముకుంద్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

'మైనార్టీ'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: పట్టణ కేంద్రంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ కోసం ఆసక్తి గల పదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రవేశాల కోసం మైనార్టీ, నాన్ మైనార్టీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు 72079 98969 సంప్రదించాలని కోరారు.

గురుకుల పాఠశాలలో..

పట్టణ కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 5, 6,7 తరగతిలో అడ్మిషన్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట ప్రసాద్ శుక్రవారం వెంకట ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 79950 57873 సంప్రదించాలని కోరారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలి



సమావేశమైన గ్రామస్తులు, నాయకులు

నేరడిగొండ: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ ఆలయం వద్ద హనుమాన్ ఆలయ కమిటీ, విశ్వహిందూ పరిషత్, హిందూ వాహిని, భజరంగ్ దళ్ నాయకులు సమావేశం అయ్యారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, శ్రీరామ అని 1100 దీపాలతో దీపోత్సవం, అన్నదాన కార్యక్రమం, రథయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, సర్పంచ్ పెంట వెంకట రమణ, ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, గోవర్ధన్, నారాయణ స్వామి, శ్రీకర్, శ్రీనివాస్, బ్రహ్మయ్య, సతీష్, భూమన్న, ప్రదీప్, సుమన్, నర్సయ్య, రమణ, లక్ష్మణ్, అనిల్, సంతోష్ గౌడ్, సంతోష్, రాజశేఖర్, గంగాధర్, సాయి పాల్గొన్నారు.

పర్ధాన్ కులస్తులు ఐక్యత చాటాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని ఆదివాసీ పర్ధాన్ కులస్తులు ఏకతాటిపై ఉండి ఐక్యమత్యాన్ని చాటాలని హీరసుక జయంతి ఉత్సవ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూసం ఆనందర్‌రావు, ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా మాజీ అధ్యక్షుడు దుర్వ నగేష్, ఆత్రం అనుసూయలు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 26న జిల్లాలోని ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కుల గురువు హీరసుక జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో సమావేశాన్ని నిర్వహించారు. ఎలాంటి విభేదాలు లేకుండా అందరూ ఏకతాటిపై ఉండి సమాజ్ అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఉదయం 11గంటలకు అత్యావసర సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సమాజ్ నాయకులు గోడం గంగారాం, సెడ్మకి సుభాష్, గేడం మాధవ్, సిడాం పురుషోత్తం, గేడం జనార్ధన్, ఆర్క శేషరావ్, మడావి దిగంభర్, గేడం దీపక్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ఇచ్చోడ: ఏజెన్సీలోని సమస్యలను పరిష్కరించాలని మండలంలోని అడేగామ(కె) గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది సంగెం సుధీర్‌కుమార్ శుక్రవారం ఉట్నూర్‌లో ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ కలెక్టర్ కూన గంగాధర్‌ను కోరారు. ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. అందుకు ఆయన సానుకులంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు.

బల్మూరికి ఎమ్మెల్సీ ఇవ్వడం హర్షణీయం

ఆదిలాబాద్‌టౌన్: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడం హర్షణీయమని ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణ్ ఒక ప్రకటనలో అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు అండగా ఉంటూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు.

ఆలయాన్ని శుద్ధి చేసిన భక్తులు

బోథ్: అయోధ్యలో ఈనెల 22న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా బోథ్ మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయాన్ని భక్తులు శుద్ధి చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లోని చెత్తను తొలగించారు.

కల్తీ కల్లును నిరోధించాలి

ఆదిలాబాద్‌టౌన్: కల్తీ కల్లును నిరోధించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎక్సైజ్ అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. నిషేధిత డైజోఫామ్, అల్ఫాజోలమ్ మత్తు పదార్థాలను కల్లులో కలిపిన సొసైటీ సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.

మకర తోరణ నిర్మాణానికి భూమిపూజ

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామంలో రూ13. లక్షతో నిర్మించే మకర తోరణం నిర్మాణానికి శుక్రవారం మాజీ విజయ డైయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతారెడ్డి, సీఈవో మోతే శ్రీనివాస్, గ్రామస్తులు అయ్యన్న సుభాష్, ప్రకాష్‌రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తాంసి: భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కరంజి(టి) ఉప కేంద్రం పరిధిలోని 12 మంది గర్భిణులకు వైద్యాధికారి నిఖిల్‌రాజ్ రక్త పరీక్షలతో పాటు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయన వెంట హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, ఏఎన్ఎం విజయలక్ష్మీ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత 'గిరిజాయి'

బజార్‌హత్నూర్: మండలంలోని గులాబ్‌తండా గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి కబడ్డీ పోటీల్లో శుక్రవారం ఫైనల్ మ్యాచ్‌లో గిరిజాయి జట్టు గులాబ్‌తండా జట్టుపై విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.15వేల నగదు, రన్నర్‌గా జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విద్యాసాగరా, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

బోథ్: బోథ్ గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక నాయకుడు వెంకటేశ్ శుక్రవారం బోథ్ సర్పంచ్ సురేందర్, ఉప సర్పంచ్ కట్ట పల్లవిలకు వినతిపత్రం అందజేశాడు. గ్రామంలోని డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని, పల్లె ప్రకతివనానికి వెళ్లేందుకు రహదారి ఏర్పాటు చేయా లన్నారు. ఆదర్శ పాఠశాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

నార్నూర్: మండల కేంద్రానికి చెందిన సూర్యవంశీ మారుతి హైదరాబాద్‌లో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో శుక్రవారం వారి కుటుంబసభ్యులను సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ పరామర్శించారు. పేద కుటుంబానికి రూ. 5 వేల రూపాయాలు ఆర్థిక సాయం అందజేశారు.

ముస్తాబైన రామాలయం

బోథ్: సోనాల గ్రామంలోని రామాలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని రామాలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఇందుకోసం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

మాంసం దుకాణాలు మూసి ఉంచాలి

బోథ్: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మద్యం, మాంసం దుకాణాలు మూసి వేయించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు శుక్రవారం సర్పంచ్ సురేందర్, పంచాయతీ కార్యదర్శి అంజయ్యలకు వినతిపత్రం అందించారు. మద్యం, మాంసం దుకాణదారులు స్వచ్ఛందంగా మూసి వేయాలని కోరారు.

'విమర్శించడం సరికాదు'

జైనథ్: డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాజీ మంత్రి జోగు రామన్నపై విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పులివేణి గణేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న జోగు రామన్నపై అడ్డి భోజారెడ్డి ఆరోపణలు చేయడం తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం లాటిందని మండిపడ్డారు. 30 సంవత్సరాలుగా జోగు రామన్న వెంట ఉండి, అనేక పదవులు అనుభవించి ఇప్పుడు ఆయనపైనే వ్యక్తిగతమైన ఆరోపణలు చేయడం హాస్యస్పదంగా ఉందన్నారు. సమావేశంలో సర్పంచ్ దుమాల దేవన్న, నాయకులు స్వామి, భూమన్న, చిన్నన్న, చిన్న మల్లేష్, కోవ ప్రభాకర్ పాల్గొన్నారు.